కోతుల బెడదతో బెంబేలు

- వత్తి పంటను నాశనం చేస్తున్న కోతులు
- కోతులదాడికి గురవుతున్న ప్రజలు
- సమస్యను పట్టించుకోని అధికారులు

వత్సవాయి: మండలంలోని పలు గ్రామాలలో వానరాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో దారిన పాయే వారిపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపై నడవాలంటేనే భయపడుతున్నారు.


మంగొల్లు వద్ద కోతుల గుంపు

రెండు నెలల్లో 20 మందికి గాయాలు..

చిట్టేల, మంగొల్లు, పోలంపల్లి, కంభంపాడు, వత్సవాయి, మక్కపేట, గోపినేనిపాలెం గ్రామాల్లో కోతులు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల వత్సవాయి, చిట్టేల, మక్కపేట గ్రామాల్లో గడచిన రెండు నెలల్లో దాదాపు 20 మంది వరకు వీటి బారినపడి గాయాలపాలయ్యారు. ద్విచక్ర వాహనాలపై పోతున్న వారి వెంబడి పడుతుండడంతో వాహనాలు అదుపు తప్పి కిందపడుతున్నారు. గ్రామాల్లో కోతులను నిర్మూలించడం అధికారులకు, ప్రజాప్రతినిధులకు సవాల్‌గా మారింది. పలు గ్రామాల్లోని వార్డు సభ్యులు పలు దఫాలు పంచాయతీ సమావేశాలలో కోతుల బెడద నుంచి రక్షించాలని తీర్మానం చేసినా ప్రయోజనం ఉండడంలేదని చెబుతున్నారు.

కోతుల బారిన పడుతున్న విద్యార్థులు

పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా వీటి బారినపడి గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయాలలో ట్యూషన్ల నుంచి ఇంటికి తిరిగి వస్తున్న చిన్నారులపై మాటున ఉండి దాడికి దిగుతున్నాయి. పాఠశాల, ట్యూషన్లకు వెళ్లిన పిల్లలు ఇంటికి వచ్చేదాకా తల్లితండ్రులు భయపడు తున్నారు. వీధులలో కూర్చుంటున్న వృద్ధులు, ఆడుకుంటున్న చిన్నారులు సైతం వీటి బారిన పడుతున్నారు.

పంటలను నాశనం చేస్తున్న కోతులు..

కోతుల ధాటికి పత్తి, మొక్కజొన్న పంటలను కాపాడుకోవడం రైతులకు సవాల్‌గా మారింది. ఒకేసారి గుంపులుగా వచ్చి పత్తి కాయలను, మొక్కజొన్న కంకులను నాశనం చేస్తున్నాయి. పంటపొలాల్లో కూడా సంచరిస్తుండడంతో రైతులు వీటి నుంచి పంటలను ఎలా రక్షించుకోవాలో అర్థం కావడంలేదు. పత్తి కాయలను సగానికి కొరకడంతో దేనికీ పనికి రాకుండా పోతున్నాయి. పత్తి పంటపై దాడిచేస్తున్న కోతులను వెళ్లగొట్టడానికి ఒక్కరే వెళ్తే రైతులను గాయపరుస్తున్నాయి. దీంతో రైతులు దీపావళి బాంబులు విసరడం, పెద్ద పెద్ద శబ్దాలు వచ్చేలా సౌండ్‌లు చేయడం వంటివి చేస్తున్నారు.

కోతులతో ఇబ్బందులు



కోతుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పగలు వ్యవసాయ పనులకు వెళ్లడం వల్ల ఇళ్ల వద్ద ఎవరూ ఉండడంలేదు. దీంతో వాటి ఇష్టం వచ్చినట్లు చెలరేగి పోతున్నాయి. అంతేకాకుండా పంట పొలాలను సైతం నాశనం చేస్తున్నాయి. వాటినుండి పంటలను ఎలా రక్షించుకోవాలో తెలియడంలేదు. దూర ప్రాంతాల నుంచి లారీల ద్వారా తీసుకువచ్చి రాత్రి సమయాలలో ఈ ప్రాంతాలలో వదిలివెళ్తున్నారు.

– ఎస్.వీరబాబు, మంగొల్లు

స్పందించాలని వినతి

గ్రామాలలో జరిగే సభలు, సమావేశాలలో పలుమార్లు సమస్యను విన్నవించినా పట్టించుకోవటం లేదని ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఒక వర్గానికి కొమ్ముకాస్తున్న అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి ఎంతో కృషి చేశామని సొంత డబ్బులు ఖర్చుచేసి పార్టీ అభివృద్ధి కోసం పనిచేశామని అయినా అధికారులు తమ మాట వినటం లేదని అధికారపార్టీ ఎంపీటీసీ సభ్యుడు నన్నపనేని నరసింహారావు అధికారులపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో నన్నపనేని మాట్లాడుతూ ఎంపీడీఓ తీరు బాగోలేదని అన్నారు. ఎంపీపీ మలక్‌బషీర్ మాట్లాడుతూ అధికారులు గ్రామాల అభివృద్ధి కోసం పనిచేయాలన్నారు. పలు సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, సర్పంచి వేల్పుల సునీత, డిప్యూటీ ఎంపీడీఓ ఆనందకుమారి, ఎంఈఓ– 1 ఉప్పులూరి గురునాథం, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వామిత్వ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి



నందిగామ రూరల్: గ్రామీణ ప్రాంతాలలో జరుగుతున్న స్వామిత్వ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్వే ఏడీ త్రివిక్రమ రావు పేర్కొన్నారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో జరుగుతున్న సర్వే పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు, ఇళ్ల సంబంధిత వివాదాలను పరిష్కరించటమే స్వమిత్వ సర్వే ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఏళ్ల తరబడి గ్రామ కంఠం భూముల్లో నివాసముంటున్న వారికి సైతం సర్వే చేసి భూమి యాజమాన్య హక్కు పత్రాన్ని అందించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బసవరావు, ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి సోమిరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనుల పరిశీలన



సుబ్బాయిగూడెం(పెనుగంచిప్రోలు): స్థానిక ఎస్సీ కాలనీలో జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ.8 లక్షలతో నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను శుక్రవారం జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు వేగంగా, నాణ్యతగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ మోరంపుల పూర్ణయ్య, వైఎస్సార్ సీపీ మాజీ మండలాధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారం సందర్శన

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని కొహెన్స్ ఫార్మా లిమిటెడ్ కర్మాగారాన్ని శుక్రవారం విజయవాడ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఫ్యాక్టరీస్ ఎంవీ శివకుమార్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కర్మాగారంలోని కార్మికుల భద్రతా ఏర్పాట్లను తెలుసుకున్నారు. బుధవారం రాత్రి కర్మాగారంలోని బాయిలర్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు కావటంతో వైద్య సేవలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్మాగారంలో తీసుకుంటున్న భద్రతా చర్యలపై నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటంతో మండిపడ్డారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిని విజయవాడలోని ట్రస్ట్ హాస్పిటల్‌కు తరలించి మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ చైర్మన్ రఘురామ్‌కు సన్మానం



జగ్గయ్యపేట అర్బన్: నియోజకవర్గంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్‌కు ఆత్మీయ అభినందన సభ శుక్రవారం పట్టణంలోని బీ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు మంజూరు చేసిన రూ.12 కోట్ల 30 లక్షల, 75 వేల రుణాలను డ్వాక్రా మహిళలు, రైతులకు ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే తాతయ్య, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్ పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ టీడీ.జనార్దన్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాలకోటయ్య, కట్టా నరసింహారావు, మేకా వెంకటేశ్వర్లు, వడ్లమూడి బాబు, చింతల సీతారామయ్య, తోట నాగమల్లేశ్వరరావు, సీనియర్ నాయకులు, నియోజకవర్గ పీఏసీఎస్ అధ్యక్షులు, రైతులు, బ్యాంకు, సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతుల ప్రదానం

మైలవరం(జి.కొండూరు): ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేయడం వల్ల వారి మధ్య పోటీతత్వం పెరిగి భవిష్యత్‌లో మంచి ఫలితాలు సాధించేందుకు వీలుంటుందని ఎంఈఓ ఎల్.బాబు అన్నారు. మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గత పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం స్థానిక ఎస్ఎస్‌కే పాఠశాలలో అందజేశారు. ట్రస్టు ప్రతినిధులు కాటమనేని వెంకటేశ్వరరావు, అడుసుమిల్లి విఠల్‌బాబు, జూలకంటి ప్రసాద్, గూడూరు నాగిరెడ్డి, కోయసుధ, అమీర్ హంజా, గొల్లపూడి మోహన్‌రావు, భావన పాల్గొన్నారు.

కష్టపడేవారికి వైఎస్సార్ సీపీలో సముచిత స్థానం

మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: పార్టీ పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేసే ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన ఆడిటర్ మద్దుకూరి సాయిబాబును స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ యువత రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, కర్రి రవీంద్ర, షేక్ యాకుబ్ అలీ, గుడేటి శ్రీనివాసరావు, చిలుకూరి బుచ్చిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మద్దుకూరి సాయిబాబును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

గాయపడిన కార్మికుడికి పరిహారం ఇవ్వాలి

సీఐటీయూ నేతల డిమాండ్



జగ్గయ్యపేట అర్బన్: కోహెన్స్ ఫార్మా కంపెనీలో గాయపడిన కార్మికుడికి నష్టపరిహారంతో పాటు పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డీవీఆర్ నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ముక్త్యాల గ్రామ సమీపంలోని కోహెన్స్ ఫార్మా కంపెనీలో ఎం.రామకృష్ణ అనే కార్మికుడు ప్రమాదానికి గురవడంతో చేతివేళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయని తెలిపారు. ప్రమాదానికి గురై ఉపాధిని కోల్పోయిన కార్మికుడిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కార్మికుడికి మెరుగైన వైద్యం అందించి రూ.15 లక్షల నష్టపరిహారం అందజేయాలని, ఆ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ గౌసమియా, సీఐటీయూ నాయకులు కోట రవికుమార్, కాకనబోయిన వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

జగ్గయ్యపేట: మండలంలోని జయంతిపురం, వేదాద్రి గ్రామాలలోని ప్రభుత్వ భూములను నందిగామ ఆర్డీవో బాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల పరిధిలో ఏపీ ఐడీసీ భూములున్నాయన్నారు. ఈ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. దీనిలో భాగంగానే పరిశీలించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, సర్వేయర్ అనూష్, వీఆర్వో, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేత

- విద్యుత్ బిల్లులు చెల్లించకపోవటమే కారణం
- మూడు వారాలుగా నిలిచిపోయిన పనులు
- సేవలు అందక అవస్థలు పడుతున్న ప్రజలు

నందిగామ రూరల్: అంబారుపేట గ్రామ సచివాలయానికి విద్యుత్ సౌకర్యాన్ని అధికారులు తొలగించారు. ఏడు, ఎనిమిది నెలలుగా విద్యుత్ బిల్లులు చెల్లించటం లేదని పలుమార్లు చెప్పినప్పటికీ స్పందించకపోవటంతో మూడు వారాల క్రితం సచివాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవటంతో సచివాలయంలో అందిస్తున్న సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఆయా పనులపై సచివాలయానికి రావటం విద్యుత్ సరఫరా లేదని తెలుసుకుని వెనుదిరగాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఎనిమిది నెలలుగా అద్దె కూడా చెల్లించటం లేదని భవన యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


అంబారుపేటలో సచివాలయం నిర్వహిస్తున్న అద్దె భవనం

స్పందించని అధికారులు..

దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు కనీసం స్పందించటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయంలోని ఇబ్బందులతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిన విషయాన్ని ఎంపీడీవోతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు తెలిపినా ఫలితం లేకపోయిందని గ్రామ నాయకులు, ప్రజలు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టి సచివాలయ సేవలను అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కళా ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గంద్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి కళాఉత్సవ్‌లో ప్రతిభ కనబర్చారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని అంగలూరు డైట్ కళాశాలలో ఈ నెల 11,12 తేదీలలో జిల్లా స్థాయిలో కళా ఉత్సవ్ నిర్వహించారు. ఈ ఉత్సవ్‌లో శాస్త్రీయ నృత్యం, జానపద గేయాలలో విద్యార్థులు లింగబోయిన తేజశ్రీ, దొండ శ్రీలత, వల్లాపురం స్వాతి, దారెల్లి ప్రణిత, పచ్చిపాల భువనేశ్వరీ, రేగళ్ల అపర్ణ, కుంచపు లక్ష్మి, శ్రావ్య, శ్రీవల్లీ ప్రతిభ చూపారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాంబాబు, ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

నందిగామ రూరల్: కృష్ణా జిల్లాలోని అంగలూరు డైట్ కళాశాలలో గురువారం జరిగిన కళాఉత్సవ్ కార్యక్రమంలో మండలంలోని మాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులు పాలపాటి ఉదయ్‌కిరణ్, పాలపాటి బాలాజీలను శుక్రవారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డైట్ పాఠశాలలో జరిగిన ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ పోటీలలో ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆమె ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నందిగామ రూరల్: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈ నెల 22న మాదిగల కృతజ్ఞతా సభ నిర్వహిస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో మాదిగల కృతజ్ఞతా సభ పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎస్సీ వర్గీకరణను అమలు చేయటం అభినందనీయమన్నారు. మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దపాటి ప్రసాద్ మాదిగ, కనకపూడి వెంకటరత్నం మాదిగ, కోండ్రు రాజు మాదిగ, మాడుగుల నాగమ్మ మాదిగ, జ్యోతి మాదిగ, న్యాయవాదులు నండ్రు శ్రీరామ్మూర్తి, చెరుకుమల్లి రామారావు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థి సన్నీ ఆచూకీ లభ్యం

ఇబ్రహీంపట్నం: అన్నమ్మ దివ్యాంగుల హాస్టల్‌లో నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిన దివ్యాంగ విద్యార్థి సన్నీ ఆచూకీ లభించింది. పోలీసులు, బంధువులు కలిసి విజయవాడ పరిసర ప్రాంతాల్లో గాలించగా గురువారం తెల్లవారు జామున భవానీపురం వద్ద లారీ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు నల్లమోతు సుభాష్ బృందం బాలుడిని గుర్తించారు. వెంటనే ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. పోలీసులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి విద్యార్థి సన్నీని అప్పగించారు. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన దైదా జోజిబాబు, జోత్స్న దంపతుల కుమారుడు సన్నీకి (మూగ, వినికిడి లోపం) ఉండటంతో పదో తరగతి విద్య కోసం మూడు నెలల కిందట దివ్యాంగుల పాఠశాలలో చేర్పించారు. బాలుడు అదృశ్యం విషయంపై హాస్టల్ యజమాని వసంత కుమారి విలేకరులతో మాట్లాడుతూ కొందరు కావాలని తమ సంస్థపై దురుద్దేశంతో విష ప్రచారం చేశారని ఆరోపించారు.


తల్లిదండ్రులు జోజిబాబు, జ్యోత్స్న వద్దకు చేరిన కుమారుడు సన్నీ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగంచిప్రోలు: మండలంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ వెంకటకృష్ణ శుక్రవారం తెలిపారు. పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, నవాబుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు నరకటం, లైన్‌మెయింట్‌నెన్స్ ఉన్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

నందిగామ రూరల్: నందిగామ పట్టణంలోని 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటెనెన్స్‌లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణం, మండలంలోని చందాపురం, ఐతవరం, అంబారుపేట గ్రామాలలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగ్గయ్యపేట: పట్టణంలో శనివారం పలు ప్రాంతాలలో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ ప్రమీల శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ముక్త్యాల రోడ్డు, రామాలయం, ఆకులవారి వీధి, అద్దాల బజారు, రంగస్వామి, కాగితాలు, నాగమయ్య, బ్రాహ్మణ, మఠం శివాలయం ప్రాంతాలలో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతు పనుల కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలంకారప్రాయంగా అతిథి గృహం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం సమీపంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహం అలంకారప్రాయంగా మారింది. కొన్నేళ్ల క్రితం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సువిశాల ప్రాంతంలో అతిథి గృహాన్ని నిర్మించారు. అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి అతిథి గృహంలోని 10 గదులకు మరమ్మతులు చేయించటంతో పాటు అత్యంత విలాసవంతమైన ఫర్నీచర్‌తో సిద్ధం చేశారు. దీంతో అతిథి గృహం వినియోగంలోకి వచ్చింది. తిరిగి గత కొంత కాలంగా అతిథి గృహాన్ని అధికారులు పట్టించుకోకపోవటంతో నిరుపయోగంగా మారింది. పంచాయతీ రాజ్ శాఖాధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు నెలకొన్నాయి. వేదాద్రి గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారని, అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకువస్తే పంచాయతీ రాజ్ శాఖకు ఆదాయం వస్తుందని, అయినా పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల గేట్‌లు పగలగొట్టి ఫర్నీచర్ అపహరించారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో మందు బాబులు మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథి గృహానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో నితిన్‌ను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వినియోగంలోకి తీసుకు వస్తామని తెలిపారు.


పంచాయతీ రాజ్ అతిథి గృహం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వీరులపాడు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంభిస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుందర రామారావు పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు కూటమి ప్రభుత్వ ఉదాసీన వైఖరిని నిరసిస్తూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని జుజ్జూరు గ్రామంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ అమలుపై ప్రభుత్వం నోరు మెదపటం లేదన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, తాత్కాలిక ఉపశమనంగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాసరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

500 మందికి కంటి వైద్య పరీక్షలు

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో విజయవాడకు చెందిన వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ కే రామ్మోహనరావు శిబిరం వివరాలను తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వాసన్ ఐ కేర్ ఆసుపత్రి మెంబర్ బాలు, గోపీకృష్ణ, మొహిద్దీన్ అధ్యాపకులు, విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 500 మందికి పైగా కంటి పరీక్షలు చేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారిని గుర్తించి కళ్లజోళ్లు ఇచ్చేందుకు సిఫారసు చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి బీ సాయి రామకృష్ణ, పీ శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.